నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, మంగళవారం 23 జనవరి 2024 | KAMAREDDY




కామారెడ్డి పట్టణంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



నవీపేటలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్‌పై ఆయోధ్య వేడుకలను తిలకిస్తున్న భక్తులు



బీర్కూర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



అయోధ్య బాల రాముడు



చందూర్‌లో వెలిగించిన 'జైశ్రీరామ్' దీపాలు

## అంతటా తన్మయత్వం..

బాలరాముడు తన సొంత ఇంటికి చేరిన వేళ ఉమ్మడి జిల్లాల్లోని అన్ని రామాలయాలు, ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ఇతరత్రా ధార్మిక కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఉదయం నుంచి పంచామృతాభిషేకాలు, స్వామి వారికి విశేష అలంకరణ, అష్టోత్తర శతనామార్చన, రామాయణ పారాయణం చేశారు. మధ్యాహ్నం 12గంటల నుంచి అయోధ్యలో నిర్వహించిన కార్యక్రమాల ప్రసారాలను ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్‌లపై ప్రజలంతా వీక్షించారు. ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో భజనలు, సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరాముడి విజయమంత్రం జపించారు. ఆలయాల వద్ద అన్నదానాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడళ్లలో, ఇండ్లపై కాషాయ జెండాలను ఏర్పాటు చేశారు. ప్రధాన పట్టణాల్లో ఆయా సంస్థల ప్రతినిధులంతా విగ్రహ ప్రతిష్ఠ శుభాకాంక్షలు చెబుతూ హోర్డింగ్‌లు, బ్యానర్లు సైతం ఏర్పాటు చేశారు.



బిచ్కుందలో భజనలు చేస్తున్న వార్కారీలు



దేశాయ్‌పేటలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

# అయోధ్యాపురి.. ఆధ్యాత్మిక ఝరి

- మార్మోగిన రామనామం
- ప్రాణప్రతిష్ఠ వేళ ఉమ్మడి జిల్లాలో సంబురం
- తన్మయత్వంలో మునిగి తేలిన రామభక్తులు
- ఊరూరా భజనలు, కీర్తనలు, అన్నదానాలు
- చారిత్రక ఘట్టాన్ని టీవీల్లో వీక్షించిన భక్తులు

నిజామాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ మహోత్సవం అంగరంగ వైభవంగా జరుగగా... ఈ చారిత్రక ఘట్టాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తజనం పరవశించి పోయింది. ఎన్నో ఏండ్ల కల సాక్షాత్కారం కావడంతో రామాలయాలు, ఇతర దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి శ్రీరాముడ్ని కొలిచారు. అయోధ్యలో రామమందిరం నిర్మాణం కోసం వందల ఏండ్లుగా ఎదురుచూస్తున్న హిందువుల కల నెరవేరడంతో అంతటా సంబురం కనిపించింది. పలు వివాదాలు, న్యాయ పోరాటాల అనంతరం రామాలయ పునర్నిర్మాణం, బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. సోమవారం మధ్యాహ్నం 12.20గంటలకు బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ, కుంభసంప్రోక్షణ నిర్వహించారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, హిందూ వాహినితోపాటు పలు ధార్మిక సంస్థలు ఇచ్చిన సూచనల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ఆలయాలతోపాటు ఇండ్లలోనూ వేడుకలు నిర్వహించారు.

### కాంగ్రెస్‌పై మండిపాటు..

అయోధ్య బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ వేళ దేశమంతటా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు సోమవారం సెలవు ప్రకటించాయి. కానీ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం సెలవుపై నిర్ణయం తీసుకోకపోవడంపై ప్రజలు తీవ్రంగా తప్పుపట్టారు.



వేల్పూర్‌లో కరసేవకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వేముల



### హోరెత్తిన జైశ్రీరాం నినాదాలు..

అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సుమూహూర్తాన జరిగిన కార్యక్రమాలను టీవీల్లో చూసిన జనాలంతా జైశ్రీరాం నినాదాలతో హోరెత్తించారు. అద్భుతమైన ఘడియ కోసం వేయి కండ్లతో ఎదురుచూసిన వారంతా ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగిన అపురూపమైన చారిత్రక ఘట్టాన్ని కండ్లారా వీక్షించారు. వివిధ చారిత్రక ఘట్టాల్లో పాల్గొన్న కర సేవకులంతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి నాటి అనుభవాలను గుర్తుచేసుకున్నారు.



కామారెడ్డి రామాలయంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠను వీక్షిస్తూ మొక్కుతున్న భక్తులు



సుభాష్‌నగర్ రామాలయంలో అయోధ్య వేడుకలను వీక్షిస్తున్న భక్తులు



భీమ్‌గల్‌లో మంగళహారతులతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



బిచ్కుందలో పూజలు చేస్తున్న ఎంపీ బీబీపాటిల్



నిజామాబాద్ నగరంలో నిర్వహించిన శోభాయాత్రలో జై శ్రీరామ్ జెండాలతో మహిళలు



నిజామాబాద్‌లో చిన్నారుల నృత్య ప్రదర్శన



నిజామాబాద్ నగరంలోని గోల్‌హన్మాన్ వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శంభుని గుడి వద్ద..



ఇందల్వాయిలో దీపాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

## రేపు ఉద్యోగ మేళా

కంఠేశ్వర్, జనవరి 22: నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీమల్ల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని శివాజీ నగర్‌లో ఉన్న ఉపాధి కల్పనా కార్యాలయంలో మేళా ఉంటుందని పేర్కొన్నారు. ఉద యం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఉద్యోగ మేళాలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 9581768413, 99487 48428 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఎంబీబీఎస్ ఫస్టియర్ ఫలితాలు విడుదల

ఖలీల్‌వాడి, జనవరి 22: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ ఫలితాలను అడిషనల్ డీఎంఈ, కళాశాల ప్రిన్సిపాల్ ఇందిద సోమవారం వెల్లడించారు. మొత్తం 120మంది విద్యార్థులకు 115 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. 95శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తంచేస్తూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# బడాపహాడ్ ఉర్సు ప్రారంభం

- ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం

వర్ని, జనవరి 22: మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న బడాపహాడ్ షాదుల్లా బాబా హుస్సేని ఉర్సు సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి తలపై సందాల్(గంధం) పెట్టుకొని వేడుకలను ప్రారంభించారు. ఉర్సును పురస్కరించుకొని రాష్ట్ర నలుమూలలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. జలాల్‌పూర్ గ్రామ కచేరి వద్ద కవ్వాలి కార్యక్రమంతో ఉర్సు ప్రారంభమైంది. తలపై సంధాల్ పెట్టుకొని ముందుకు సాగిన ర్యాలీలో ఫకీర్ల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ప్రత్యేకంగా అలంకరించిన గుర్రం, ఒంటెలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, వర్ని జడ్పీటీసీ బర్దావల్ హరిదాస్, మండల కో ఆప్షన్ సభ్యుడు కరీం, ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగపూడి గోపాల్, సర్పంచ్ అనితా వెంకాగౌడ్, తహసీల్దార్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఉర్సును ప్రారంభిస్తున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

### హంగామా సృష్టించిన కాంగ్రెస్ నాయకులు..

ఉర్సులో కాంగ్రెస్ నాయకులు ప్రదర్శించిన అత్యుత్సాహం భక్తులను నిరాశకు గురిచేసింది. ఎమ్మెల్యే పోచారం కవ్వాలిలో పాల్గొన్న సమయంలో అక్కడికి చేరుకున్న కాంగ్రెస్ నేత ఏనుగు రవీందర్‌రెడ్డి, అనుచరులు కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేయాలని ఆందోళన చేశారు. ఎమ్మెల్యే ముందుకు సాగుతుండగా వెనుక ఉన్న కాంగ్రెస్ నాయకులు సందాల్‌ను తాము కూడా తలపై పెట్టుకొని ప్రారంభిస్తామని హంగామా సృష్టించారు. సందాల్‌ను వెనక్కి తీసుకురావడం శుభసూచకం కాదని నిర్వాహకులు చెప్పినా వినలేదు. తిరిగి ప్రారంభించాల్సిందేనంటూ మొండికేశారు. సంధాల్‌ను కొందరు బలవంతంగా వెనక్కి తెచ్చి తిరిగి వేడుకలను నిర్వహించారు. ఏండ్ల నుంచి వస్తున్న ఆచారాన్ని కాదని సందాల్‌ను వెనక్కి తేవడంపై నిర్వాహకులు, భక్తులు అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధి హోదా లేకపోయినా ఆధిపత్యం కోసమే హంగామా సృష్టించారని భక్తులు విమర్శించారు.

## 'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించాలి

కంఠేశ్వర్, జనవరి 22: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 39 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీవో చందర్, డీపీవో జయసుధ, ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.

### బేటీ బచావో బేటీ పడావోపై ప్రతిజ్ఞ..

జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంపై జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆడపిల్లలను రక్షిద్దాం - వారిని చదివిద్దామని పిలుపునిచ్చారు. ఈ మేరకు అంకిత భావంతో కృషిచేస్తామని జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేస్తూ సంతకాలు చేశారు.



సంతకం చేస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు